
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
ఆదివారం 10 మార్చి 2024



జపాన్‌లో ఉద్యోగాలకు శిక్షణ

గుమ్మలక్ష్మీపురం: జిల్లాలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, నర్సింగ్, ఏఎన్ఎం, జీఎన్ఎం చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు జపనీస్ భాష నేర్పించి జపాన్‌లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 20 నుంచి 32 మధ్య వయసున్న వారు అర్హులని, ఆరు నెలల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. వసతి, ఇతర సదుపాయాలు, ఇతర వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ. ఇన్.హోమ్ చూడాలన్నారు. ఆ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96769 65949 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

విజయమే లక్ష్యంగా..





- పనిచేయాలని జిల్లాలో పార్టీ శ్రేణులకు చంద్రబాబు పిలుపు
- ముఖ్య నాయకులకు దిశ, నిర్దేశం
- అభ్యర్థులను గెలిపించి.. టీడీపీ జెండా ఎగురవేయాలి
- సమరానికి సిద్ధంగా ఉండాలంటూ సూచన

పార్వతీపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తోంది... ఏ క్షణాన్నైనా కోడ్ వెలువడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో శ్రేణులకు దిశా నిర్దేశం చేసేందుకు స్వయంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు రంగంలోకి దిగారు. ఈ మేరకు జిల్లాలో పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాలకు చెందిన మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దత్తి లక్ష్మణరావుతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. వారితో అధినేత ఏమన్నారంటే.. 'జిల్లాలోని టీడీపీ విజయానికి పూర్తిస్థాయిలో కష్టపడాలి. పార్వతీపురం, కురుపాం అభ్యర్థులు బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరీలను గెలిపించి టీడీపీ జెండా ఎగురవేయాలి. వారిని ఎమ్మెల్యేలుగా గెలిపించాల్సిన బాధ్యత మీదే. రాష్ట్ర భవిష్యత్తు.. ప్రజా ప్రయోజనాల కోసం జనసేన పార్టీతో కలిసి ప్రతి నియోజక వర్గంలో అభ్యర్థులను ఎంపిక చేశాం. అందులో భాగంగానే జిల్లాలో పార్వతీపురం, కురుపాం, సాలూరు నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులను ఎంపిక చేసి.. ఎన్నికల బరిలోకి దించాం. విభేదాలను పక్కనపెట్టి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలి. జనసేన పార్టీ శ్రేణులను కలుపుకుని అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి. వైసీపీ సర్కారు వైఫల్యాలను మరింతగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లి.. ప్రజలను చైతన్యవంతం చేయాలి. ప్రతిఒక్కరూ ఓటు వేసే విధంగా చూడాలి. అభ్యర్థుల ప్రచార కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనాలి. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. సమరానికి సిద్ధంగా ఉండాలి.. వైసీపీ సర్కారు ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. అక్రమంగా కేసులు నమోదు చేసినా.. హౌస్ అరెస్టులు చేసినా.. ధైర్యంగా ముందుకు సాగాలి.. పార్టీ అండగా ఉంటుంది' అని ఆయన స్పష్టం చేశారు.

వారికి భరోసా...

- జిల్లాలో టీడీపీ బీసీ నాయకుడిగా మాజీ ఎమ్మెల్సీ జగదీష్‌కు మంచి గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలోనే పార్వతీపురం నియోజకవర్గం నుంచి విజయచంద్రను గెలిపించాలని చంద్రబాబు ఆయనకు సూచించారు. అంతేకాదు రాజకీయ భవిష్యత్తుపై జగదీష్‌కు ఫోన్‌లో చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు పార్టీ వర్గాల సమాచారం. మరోవైపు విజయమే లక్ష్యంగా పనిచేస్తూ అత్యధిక మెజార్టీతో గెలవాలని అభ్యర్థి విజయచంద్రకు సూచిస్తూ.. జగదీష్‌తో కలిసి ముందుకు సాగాలని అధినేత సూచించినట్లు తెలిసింది.
- కురుపాం నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తోయక జగదీశ్వరి పోటీ చేస్తున్నారు. అయితే దీనిపై గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దత్తి లక్ష్మణరావు అసంతృప్తితో ఉన్నారు. దీంతో చంద్రబాబునాయుడు స్వయంగా లక్ష్మణరావుకు ఫోన్ చేసి జగదీశ్వరిని గెలిపించాలని సూచించారు. భవిష్యత్‌లో పార్టీ అధికారంలోకి రాగానే సముచిత ప్రాధాన్యం కల్పిస్తామని ఆయనకు సైతం చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు సమాచారం. కాగా ఇప్పటికే లక్ష్మణరావుకు రాష్ట్ర పార్టీ కార్యాలయ నిర్వహణ కార్యదర్శిగా ఉన్నారు. చంద్రబాబు భరోసాతో జగదీశ్వరి గెలుపు కోసం మరింతగా కష్టపడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



● కలిసికట్టుగా పనిచేస్తేనే ...

టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలతో పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎటువంటి వర్గ విభేదాలు లేకుండా కలిసికట్టుగా పనిచేస్తే.. ఎన్నికల్లో విజయం సాధించడం సాధ్యమే. చంద్రబాబు సూచనలతో శ్రేణులను కలుపుకుని నేతలు ముందుకు సాగాల్సి ఉంది. రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల కోసం పనిచేస్తూ.. విజయమే లక్ష్యంగా అడుగులు వేయాల్సి ఉంది. రానున్న ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగురవేసి.. వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలకాల్సి ఉంది.



అచ్చెన్నాయుడుతో విజయచంద్ర తదితరులు

అచ్చెన్నను కలిసిన టీడీపీ నాయకులు..

తెలుగుదేశం పార్టీ పార్వతీపురం అభ్యర్థి బోనెల విజయచంద్ర శనివారం శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ గ్రామంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును కలిశారు. పార్వతీపురం నుంచి టీడీపీ-జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించినందుకు గాను అచ్చెన్నకు విజయచంద్రతో పాటు టీడీపీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ విజయం కోసం చేస్తున్న కృషి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్న నాయకుల గురించి విజయచంద్ర వివరించారు. టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని అచ్చెన్నాయుడు సూచించారు. పార్వతీపురం నియోజ కవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకొవచ్చే విధంగా కృషి చేస్తున్న విజయ చంద్రతో పాటు నాయకులను ఆయన అభినందిం చారు. అచ్చెన్నను కలిసిన వారిలో పార్వతీపురం, సీతా నగరం, బలిజిపేట మండలాల పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి , సత్యంనాయుడు, సీనియర్ నాయకులు సీతారాం, వెంకటనాయుడు, పి.సత్యనారాయణ, వేణు, కె.రామ కృష్ణ, భాస్కర్, సూర్యనారాయణ, మధు, గౌరునాయుడు, రెడ్డి శ్రీను, కోరాడ నారాయణరావు, హరిబాబు, పెద్దబ్బాయి, శ్రీను తదితరులు ఉన్నారు.



కొమరాడ: నాగావళి - జంఝావతి సంగమం దాటి గుంప సోమేశ్వరుడి ఆలయానికి తరలివస్తున్న భక్తులు

హరోం హర

- గుంపకు పోటెత్తిన భక్తజనం
- జాగరణ అనంతరం సోమేశ్వరుని దర్శనానికి బారులు



గరుగుబిల్లి: ప్రత్యేక అలంకరణలో స్ఫటిక శివలింగం

కొమరాడ, మార్చి 9 : నాగావళి - జంఝావతి నదీ సంగమం నడుమ కొలువుదీరిన గుంప సోమేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. మహా శివరాత్రి రోజున నది ఇసుక తిన్నెలపై టెంట్లు వేసి జాగరణ చేసిన భక్తులు అర్ధరాత్రి శివ దర్శనం కోసం పోటీపడ్డారు. జిల్లా నలు మూలల నుంచే కాకుండా శ్రీకాకుళం, ఒడిశా నుంచి వచ్చిన వారు శనివారం వేకువ జామున నదీ స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి నేరుగా ఆలయానికి చేరుకుని.. క్యూలైన్లలో గంటలకొద్దీ నిరీక్షించారు. అనంతరం సోమేశ్వరుడిని దర్శించుకుని పులకరించిపోయారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తజనంతో ఆలయ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. శివ నామస్మరణతో జంఝావతి, నాగావళి సంగమం మార్మో గింది. సోమేశ్వరుని దర్శనం అంతనరం సమీపంలో విక్రయించే చేపలను కొనుగోలు చేసి భక్తులు తమ ఆచారాన్ని కొనసాగించారు. ఆలయానికి వచ్చే భక్తులు సౌకర్యార్థం స్వచ్ఛంద సంస్థలు ఆహార పొట్లాలు, తాగునీరు, మజ్జిగ అందించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొమరాడ ఎస్ఐ నీలకంఠం ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా రుద్రాభిషేకం

గరుగుబిల్లి : రావివలసలో శనివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సాయి శత రుద్రాయం పూజలను ఘనంగా నిర్వహించారు. భగవాన్ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా తొలుత గ్రామంలోని సాయి మందిరం వద్ద పతాకా విష్కరణ, గోపూజ చేశారు. అనతరం రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటారు. సత్యసాయి మందిరం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. ఆ తర్వాత మందిరం ఆవరణలో స్ఫటిక శివలింగానికి రుద్రాభిషేకం చేశారు. రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు కె.సాయిశ్రీహరి, ప్రసాద్‌వర్మ, జిల్లా అధ్యక్షుడు పల్ల నేతాజీనాయుడు, వంద మందికి పైగా రుత్వికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



రామతీర్థం దేవస్థానం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రామతీర్థంలో ముగిసిన జాతర

నెల్లిమర్ల : విజయనగరం జిల్లా రామతీర్థం దేవస్థానం వద్ద రెండు రోజుల పాటు జరిగిన మహాశివరాత్రి జాతర శనివారం సాయంత్రంతో ముగిసింది. జాగరణచేసి సీతారాములను, ఉమాసదాశివస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. గొర్లెపేట, దేవుని నెలివాడ వరకు రోడ్లన్నీ జనంతో నిండిపోయాయి.

కిక్కిరిసిన పుణ్యగిరి

- జాగరణ భక్తులతో కిటకిటలాడిన మెట్లదారి
- పుట్టదార వద్ద స్నానం చేసేందుకు పోటీ

శృంగవరపుకోట, మార్చి 9 మహాశివరాత్రి జాగరణ చేసిన భక్తులతో పుణ్యగిరి కిక్కిరిసింది. స్వామి దర్శనానికి శనివారం ఉదయం వేలాదిగా భక్తులు కొండపైకి క్యూ కట్టారు. భారీగా రావడంతో మెట్లదారి కిటకిట లాడింది. శివనామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది. శివరాత్రి జాగారం చేసిన భక్తులు అర్ధరాత్రి నుంచి కొండపైకి పయనమయ్యారు. శనివారం సాయంత్రం వరకు మెట్ల దారి బారులు తీరే కనిపించింది. భక్తులంతా పుట్టదార ఘట్టం వద్ద స్నానాలు చేసేందుకు అధికంగా రావడంతో ఒకానొక దశలో పోలీసులు అదుపుచేసేందుకు చాలా శ్రమించాల్సి వచ్చింది. రూ.20, రూ.50 చెల్లించి శీఘ్ర, అతిశీఘ్ర దర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులకు కూడా స్వామిని దర్శించుకొనేందుకు మూడు గంటలకు పైబడి సమయం పట్టింది. భక్తులు అత్యధిక సంఖ్యలో మెట్లపై నిలవాల్సిరావడంతో పైమెట్లపై వున్న వారు కింద మెట్టుపై వున్నవారిపై వాలిపోవడం.. చిన్నపిల్లలు, వయసు పైబడిన వారు అవస్థలు పడడం కనిపించింది. అక్కడి జనం చూసి స్వామిని దర్శించుకోకుండానే కిందకు దిగేశామని పూసపాటిరేగకు చెందిన కొంతమంది భక్తులు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి కొండకు వచ్చిన భక్తులు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై అధికారులను ప్రశ్నించారు.



భక్తులతో కిటకిటలాడుతున్న పుణ్యగిరి కొండ మెట్ల దారి

మాతాశిశువుల ఆరోగ్యంపై దృష్టి

- డీఎంహెచ్‌వో జగన్నాథరావు

పాలకొండ: జిల్లాలో మాతాశిశువుల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని డీఎంహెచ్‌వో జగన్నాథరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పాలకొండ నీలమ్మ కాలనీలోని యూపీహెచ్‌సీని శనివారం సందర్శించారు. అనంతరం ప్రిజం-10పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులను నిరంతరం పర్యవేక్షిస్తుండాలన్నారు. వారికి కేటాయించిన పౌష్టికాహారం తీసుకుంటున్నారో.. లేదో పరిశీలించాలని సూచించారు. వారు సక్రమంగా మందులు వేసుకునేలా చూడాలన్నారు. ఈ విధంగా చేయడం వల్ల జిల్లాలో మాతా శిశు మరణాలను నివారించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో వైద్యాధికారి తేజ్ రతన్ రాజ్, వైద్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో



కాటేస్తున్నాయ్!

- జనాలను హడలెత్తిస్తున్న వీధి శునకాలు
- ఆసుపత్రులకు భారీగా వస్తున్న బాధితులు
- జిల్లాలో పది వేలకు పైగా నమోదైన కేసులు
- చినమేరంగి సీహెచ్‌సీలో 70 రోజుల్లో 100 కేసులు
- భయభ్రాంతులకు గురవుతున్న జిల్లావాసులు

(జియ్యమ్మవలస)

వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయ్.. దొరికిన వారిని దొరికినట్లు కాటేస్తున్నాయి. గుంపుగా దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. మొత్తంగా జిల్లావాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దీంతో ఇల్లు విడిచి బయటకు రావాలంటేనే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పిల్లలను బడికి పంపించాలన్నా.. తల్లిదండ్రులు ఆలోచించాల్సి వస్తోంది. శునకాల దాడిలో గాయపడిన వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. చికిత్స కోసం ఆస్పత్రుల్లో చేరుతున్న బాధితులే ఇందుకు నిదర్శనం. 'మన్యం'లో ఒక జిల్లా కేంద్రాసుపత్రి 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 అర్బన్ హెల్త్ సెంటర్లు, 3 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 3 ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. అయితే 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆయా ఆసుపత్రుల్లో భారీగా కుక్క కాటు బాధితులు చేరి చికిత్స పొందారు. అధికార గణాంకాల ప్రకారం దాదాపు 10 వేల మంది వరకు ఉన్నట్లు అంచనా. చాలామంది ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స తీసుకుంటుండగా, మరికొందరు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా వీధి కుక్కలపై అధికారులు కనీస చర్యలు తీసుకోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలను కట్టడి చేయకపోవడంతో .. అవి చిన్నా, పెద్దా అని తేడా లేకుండా అందర్నీ కాటేస్తున్నాయి. చివరకు వాహనదారుల వెంట పడుతూ.. దాడి చేస్తున్నాయి. వాటిని ఇలాగే వదిలేస్తే.. పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉంది. శునకాలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయకుంటే.. రానున్న రోజుల్లో వీధి కుక్కలు మరింతగా పెరగనున్నాయి. ఫలితంగా బాధితుల సంఖ్య రెట్టింపు కానుంది. ఇప్పటికైనా ప్రభుత్వం , ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు.

70 రోజుల్లో వంద మంది..

చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో గత 70 రోజుల్లో వంద మంది కుక్క కాటు బాధితులు చికిత్స పొందడం గమనార్హం. రానున్న కాలంలో ఇంకెంతమంది కుక్కల బారిన పడతారోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ సీహెచ్‌సీలో నమోదైన కొన్ని సీరియస్ కేసులు ఇలా..

- జనవరి 29న టీకే జమ్ము పంచాయతీ చినదోడిజకి చెందిన కొండగొర్రి సూరి అనే గిరిజనుడు కుక్క కాటుకు గురై చావు అంచుల వరకు వెళ్లి వచ్చాడు.
- ఫిబ్రవరి 14న బిత్రపాడు పంచాయతీకి చెందిన గడసాపు హర్షిత అనే రెండేళ్ల పాప, మరడాన సింహాచలం అనే 52 ఏళ్ల వ్యక్తి కుక్కల బారిన పడి గాయపడ్డారు.
- ఫిబ్రవరి 24న గరుగుబిల్లి మండలం నందివానివలసకి చెందిన మరడాన పారమ్మ అనే మహిళ కుక్క కాటుకు గురైంది.
- ఫిబ్రవరి 28న బిత్రపాడులోని ఓ యువతిపై 12 కుక్కలు ఒకే సారి దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. శరీరంపై దాదాపు 30 గాట్లు పడ్డాయి.
- అదే రోజు చినమేరంగికి చెందిన జి.సోములు అనే వ్యక్తి కూడా శునకాల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు.
- ఫిబ్రవరి 29న చినమేరంగికి చెందిన వి.రాజు కుక్క కాటు వల్ల తీవ్రంగా గాయపడ్డాడు.
- అదే రోజు కొమరాడ మండలం నిమ్మలపాడుకి చెందిన గళావల్లి పార్వతి కూడా కుక్క కాటుకు గురైంది.





కుక్కల దాడిలో చినమేరంగిలో గాయపడిన బాలిక, ఓ మహిళ (ఫైల్)

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం

వీధి కుక్కల దాడి విషయం మా దృష్టికి వచ్చింది. ప్రజలు భయబాంత్రులకు గురవుతున్నారు. అయితే దీనిపై పంచాయతీల నుంచి గ్రామసభ తీర్మానం తీసుకొని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం..

- పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో, జియ్యమ్మవలస



గుంపుగా తిరుగుతున్న వీధి కుక్కలు

తూర్పుకాపులకు సీట్లు కేటాయించాలి

విజయనగరం దాసన్నపేట: రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఉత్తరాంధ్రలో అత్యధిక జనాభా ఉన్న తూర్పు కాపులకు జనాభా ప్రాతిపదికన ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించాలని తూర్పు కాపు సామాజిక వేదిక రాష్ట్ర సంఘ సభ్యుడు మజ్జి అప్పారావు, జిల్లా అధ్యక్షుడు రొంగలి రామారావు డిమాండ్ చేశారు. శనివారం కామాక్షినగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలో 2012లో నాలుగుస్థానాల్లో తూర్పుకాపులు ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారన్నారు. 2019లో మూడు స్థానాలు కేటాయించారన్నారు. 2024లో ఒకటి కేటాయిస్తారా? అంటూ ప్రశ్నించారు. టీడీపీ-జనసేన-వైసీపీ పార్టీల రాష్ట్ర నాయకత్వం తూర్పుకాపుల జనాభా ప్రాతిపదికన విజయనగరం ఎంపీతో పాటు పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే సీట్లను కేటాయించాలన్నారు. వేదిక జిల్లా ప్రతినిధి మంత్రి రమణమూర్తి మాట్లాడుతూ, ఇప్పటికైనా పార్టీలతో సంబంధం లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, సార్వత్రిక ఎన్నికల్లో తూర్పుకాపులకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. సమావేశంలో వేదిక ప్రతినిధులు నాగభూషణం, పిన్నింటి సూర్యనారాయణ, చంద్రమౌళి, వెంకట రమణ, చెల్లూరు రమణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల లబ్ధి కోసమే గ్యాస్ ధర తగ్గింపు

బొబ్బిలి: ఎన్నికల వేళ వంటగ్యాస్‌పై వందరూపాయలను మోదీ ప్రభుత్వం తగ్గిస్తున్నట్లు ప్రకటించడం మోసపూరితమని పీసీసీ అధికార ప్రతినిధి ముప్పల శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో వంట గ్యాస్ 410 రూపాయలు, డీజిల్ 50 రూపాయలు, పెట్రోలు లీటరు 70 రూపాయలు ఉండేదని, అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గిన నేపథ్యంలో పెట్రో ఉత్పత్తులను గణనీయంగా తగ్గించాల్సిన కేంద్రం వాటి జోలికి పోవడం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వాటన్నింటి ధరలనూ తగ్గించాలని డిమాండ్ చేశారు.

తాపీ పనివార్ల సంఘం
నూతన కార్యవర్గ ఎన్నిక

బొబ్బిలి: బొబ్బిలి పట్టణ శ్రీ దాడితల్లి తాపీపనివారల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షునిగా కర్రోతు గౌరీశంకరరావు, ఉపాధ్యక్షునిగా మంత్రపూడి సింహాచలం, కార్యదర్శిగా పొట్నూరు సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా గిడుతూరి ప్రసన్నగోపి, కోశాధికారిగా బొత్స సుధాకరరావు, జగ్గంపూడి మాధవరావు ఎన్నికయ్యారు. సంఘం గౌరవాధ్యక్షులుగా ఉంగరాల వెంకటరావు, కొసిరెడ్డి అప్పలనాయుడు, ఆదాడ శ్రీనివాసరావు, సలహాదారులుగా పళ్ల జనార్దనరావు, వెంపలిబాబు, మరడ సింహాచలంను ఎన్నుకున్నారు. మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు గోపి తెలిపారు.

రేపు కోఆర్డినేషన్ సమావేశం

రాజాం: పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా ఈనెల 11వ తేదీన ఉదయం 11 గంటలకు కోఆర్డినేషన్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో మాధవరావు ఒక ప్రకటనలో కోరారు. ఈ సమావేశంలో జాతరకు ముందస్తు ఏర్పాట్లు సంబంధించిన విషయాలపై చర్చించనున్నారని ఆలయ కమిటీ ప్రతినిధులు సభ్యులు పోలీసు అధికారులు, పత్రికా మీడియా విలేకర్లు హాజరు కావాలని ఈవో కోరారు

ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు నోటిఫికేషన్

జామి: జిల్లాలో గజపతినగరం, రాజాం క్లస్టర్లలో ఫిజియోథెరపిస్టులుగా పని చేసేందుకు సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయం దరఖాస్తులను ఆహ్వానించింది. ఇంటర్‌మీడియట్‌తో పాటు బీపీటీ, ఎంపీటీ అర్హత ఉన్న స్థానిక అభ్యర్థులకే ప్రాధాన్యం ఉంటుందన్నారు. నెలకు రూ.12వేలు గౌరవ వేతనం చెల్లిస్తారని, దరఖాస్తులను ఆదివారం సాయంత్రం 5గంటల్లోపు సమర్పించాలని సమగ్ర జిల్లా శిక్ష అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

ముగిసిన వర్క్‌షాప్

విజయనగరం: పట్టణంలోని తోటపాలెంలో ఉన్న సత్యా డిగ్రీ, పీజీ కళాశాలలో ఐదురోజులుగా జరుగుతున్న నైపుణ్యాలపై అవగాహనా కార్యక్రమం శనివారం ముగిసింది. మహీంద్ర ప్రైడ్ క్లాస్‌రూమ్, నాంది ఫౌండేషన్, ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైనర్లు కె గౌతమ్ శంకర్, పి వేణుగోపాల్ ఐదు రోజులపాటు శిక్షణ అందించారు. విద్యార్థులకు శిక్షణ సర్టిఫికెట్లు అందించారు. కళాశాల సంచాలకులు శశిభూషణరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కావాలంటే విధిగా సంబంధిత విభాగాల్లో నైపుణ్యం ఉండాలన్నారు. నైపుణ్య శిక్షణ, అవగాహన వర్క్‌షాప్ విద్యార్థులకు ఎంతగానో వినియోగ పడుతుందని వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం: పొగిరి బొద్దాం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సబ్‌డివిజనల్ అధికారి సీహెచ్ మాధవరావు, రూరల్ ఏఈ వావిలిపల్లి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు గా రెండు సబ్‌స్టేషన్ల నిర్వహణ బాధ్యతలను చేపడు తున్నామని పొగిరి సబ్ స్టేషన్ పరిధిలోని అంతికాపల్లి మొగులివలస, పొగిరి సెంట, నాగులవలస వి.ఆర్ అగ్రహారం, వీఆర్ అగ్రహారం కాలనీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని బొద్దాం సబ్‌స్టేషన్ పరిధిలోని బొద్దాం. పెనుబాక. కొఠారిపురం నందబలగ, లక్ష్మీంపురం, శ్యాంపురం, గారాజుచీపురుపల్లి ఎం జోగివలస బొమ్మినాయుడు వలస, మారెడుబాక, తదితర గ్రా మాలకు ఉండదని పరిశ్రమలకు కూడా సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని ప్రజలు పరిశ్రమల నిర్వహకులు సహకరించాలని వారు కోరారు.

సంగాం దేవాలయానికి రూ.కోటి మంజూరు

● దేవదాయ కమిషనర్ సత్యనారాయణ

వంగర, మార్చి 9: అత్యంత ప్రాచుర్యం పొందిన దేవాలయాల్లో ఒకటైన సంగాం సంగమేశ్వరదేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేసిందని దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. శనివారం రాత్రి ఆయన సంగాం ఆలయాన్ని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. దేవాలయంలో మౌలికవసతులు, ఇతరవాటిని పరిశీలించి దేవాలయ అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. సంగమేశ్వర ఆలయ పనులకు ఇప్పటికే టెండర్లు పిలిచినట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం, మోలియాపుట్టిలోని ఆలయాల అభివృద్ధికి మరో రెండుకోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం 170 కోట్లు రూపాయలు మంజూరు చేసినట్లు వివరించారు. అన్ని ఆలయాలు వీలున్నంత వేగంగా నిర్మాణాలు పూర్తిచేస్తామన్నారు. ఆలయ సిబ్బంది కమిషనర్‌కు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈయన వెంట సిబ్బంది ఏసీ అన్నపూర్ణ, లక్ష్మీ, కేశవరావు, బోనునాగరాజు, రామకృష్ణ, గణపతితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆడపిల్లల ఉన్నత చదువులకు హామీ

● మాజీ మంత్రి కోండ్రు మురళి

రాజాం, మార్చి 9: రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ కూడా ఉన్నత చదువుల కోసం డబ్బులకు ఇబ్బందులు పడి ఇంటికి పరిమితం అవ్వకుండా ఉండేందుకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నూతన పథకాన్ని తీసుకు వచ్చారని మాజీ మంత్రి కోండ్రు మురళి అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని లచ్చయ్యపేట, యాతవీధి, గొల్ల వీధి, చాకలవీధి తదితర ప్రాంతాల్లో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ నాలుగో రోజైన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఘన స్వాగతం పలకడమే కాకుండా పూల వర్షం కురిపించారు. అడుగడుగునా మంగళ హారతులు పట్టారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ కూడా ఉన్నత చదువుల కోసం డబ్బులకు ఇబ్బందులు పడకూడదని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకం అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి తెలుగింటి ఆడపడుచు కూడా నిధుల కొరత కారణంగా రాజీ పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ పథకం కింద అర్హత ఉన్న మహిళలందరూ దేశంలో ఎక్కడైనా తమకు వచ్చిన ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించవచ్చునన్నారు. టీడీపీని అధికారంలోకి తీసుకురావడమే కాకుండా నారా చంద్రబాబునాయుడును సీఎంను చేయాలన్నారు. చంద్రన్న పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని కోండ్రు అన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాశ్‌రావు, శాసపు రమేష్ కుమార్, దుప్పలపూడి శ్రీనివాసరావు, పొట్నా చిట్టిబాబు, బనిశెట్టి వెంకటరావు, పిల్లా సత్యంనాయుడు, మరిపి జగన్మోహన్‌రావు, యందవ సూరిబాబు, టంకాల నాగరాజు, టంకాల కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



కోండ్రుకు పూలతో స్వాగతం పలుకుతున్న మల్లయ్యపేట కాలనీ ప్రజలు

దళితులు మోసపోయారు

● పథకాలు రద్దు.. దాడులు, అత్యాచారాలు, హత్యలు

● 'జయహో ఎస్సీ'లో టీడీపీ నేతలు

విజయనగరం రూరల్, మార్చి 9: ఐదేళ్ల వైసీపీ పాలనలో దళితులు మోసపోయారని, రానున్న ఎన్నికల్లో దళితులంతా టీడీపీకి అండగా నిలవాలని టీడీపీ ఎస్సీ సెల్ విభాగం నాయకుడు మామిడి రవిశంకర్, కండువా ప్రకాష్ పిలుపునిచ్చారు. జయహో ఎస్సీ కార్యక్రమంలో భాగంగా నగరంలోని జొన్నగుడ్డి ప్రాంతంలో స్టేడియం పేటలో ఎస్సీ నాయకులు ఇంటింటికి వెళ్లారు. ఐదేళ్ల కా లంలో దళితులపై జరిగిన దాడులు, హత్యలు, అత్యాచారాలు వంటివి వివరించా రు. అదే విధంగా గత ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన 27 పథకాలను రద్దు చేశారన్నారు. దళితులను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీ యంగా ముందుకు తీసుకువెళ్తానని హామీ ఇచ్చిన జగన్.. అధికారంలోకి వచ్చాక మాట తప్పార న్నారు. 27 పథకాలు రద్దు చేయడం ద్వారా దళితులకు ఎంతో అన్యాయం జరిగిందన్నారు. దళితులకు సంబంధించి స్వయం ఉపాధి పొందేందుకు రుణాలు కూడా ఇవ్వలేదన్నారు. దళిత వాడల్లో మౌళిక సదుపా యాలు కూడా లేవని, దళి తుల సంక్షేమానికి కృషి చేయనున్న టీడీపీకి రానున్న ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



జొన్నగుడ్డి, స్టేడియంపేటలో పర్యటిస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

ఘనంగా శివరాత్రి వేడుకలు



తుమ్మికాపల్లి గేట్ వద్ద మలయంలో పూజలు

కొత్తవలస : మహా శివరాత్రి వేడుకలను శనివారం ఘనంగా శివాలయాలలో నిర్వహించారు. అర్ధరాత్రి వరకు ఆలయాల్లో రుద్రాభిషేకాలను చేశారు. మండలంలోని తుమ్మికాపల్లి గేట్ సమీపంలో ఉన్న ఉమా రామలింగేశ్వర ఆలయంలో శనివారం పార్వతీ పరమేశ్వర్ల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు

శృంగవరపుకోట: శృంగవరపుకోట పుణ్యగిరి శ్రీఉమాకోటి లింగేశ్వర స్వామికు విశాఖ పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్ మహాశివరాత్రి ప్రత్యేక పూజలు చేసారు. శనివారం ఉదయం కొండపైకి వచ్చిన ఇతను పుట్టధార స్నాన ఘట్టం వద్ద స్నాన అచరించారు. అనంతరం శ్రీ ఉమాకోటిలింగేశ్వర స్వామికు పాలాభిషేకం చేసారు.



వంగర: సంగాం జాతరలో భక్తుల సందడి

● **శృంగవరపుకోట రూరల్/జామి:** శివరాత్రి జాగరణ పురస్కరించుకున్న భక్తులు శివాలయాల్లో శివుడ్ని దర్శించుకుని పూజలుచేశారు.

● **వంగర:** సంగాంలోని సంగమేస్వర స్వామిదేవాలయం సన్నిధిలో మహాశివరాత్రిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతరకు రెండో రోజూ శనివారం భక్తులు పోటెత్తారు. శనివారం పవిత్రమైన రోజుగా భావించిన భక్తులు త్రివేణి సంగమ ప్రాంతంలో స్నానాలకు వెళ్లారు. పిత్రులకు ఆత్మశాంతికి పిండ ప్రదానాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అనేక మంది భక్తులు సంగమేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్నారు. సాయంత్ర సమయములో స్వామివారి పల్లకి ఊరేగింపుతో పాటు ప్రత్యేకకార్యక్రమాలు నిర్వహించారు. రాజాం సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎసై జనార్ధనరావు పర్యవేక్షణలో గట్టిపోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఎస్.కోట పుణ్యగిరి కొండెక్కుతున్న విశాఖ పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి ఎ.శ్రీభరత్



ఎస్.కోట మండలం సంతగైరమ్మపేటలో..

'సూర్యఘర్' పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

విజయనగరం దాసన్నపేట, మార్చి 9: కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం 300 యూనిట్లలోపు విద్యుత్ బిల్లు కట్టలేని భా రతీయులను దృష్టిలో ఉంచుకుని ప్రవేశపెట్టిన సూర్యఘర్ ముక్త్ బీజిలీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రధాన తపాలా కార్యాలయంలోని పోస్టుమాస్టర్‌ని కలిసి పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి నమోదు చేయించాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ పథకాన్ని ప్రవేశపెట్టి 2024-25 బడ్జెట్‌లో 75 వేల కోట్ల రూపాయలను కేటాయించిందని, ఈ పథకంలో నమో దైన వారు మీ ఇంటికి వచ్చే పోస్టుమ్యాన్‌ను సంప్రదించాలని సూచించారు. కార్య క్రమంలో బీజేపీ నాయకులు కుసుమంచి సుబ్బారావు, పి అశోక్, సుదీర్, జగ్గారా వు, రమేష్, సోము మహేష్, మజ్జి రాంబాబు, గిరిబాబు పాల్గొన్నారు.



పోస్టుమాస్టర్‌కు వినతిపత్రమిస్తున్న దృశ్యం

విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా రాంబాబు

బొబ్బిలి, మార్చి 9: పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన చీమల రాంబాబును తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా నియమించినట్లు టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన తెలిపారు. శనివారం స్థానిక దర్బారుమహల్‌లో రాంబాబును ఆయన అభినందించారు. వచ్చే ఎన్నికల్లో బేబీనాయన విజయానికి తన వంతు కృషి చేస్తానని రాంబాబు తెలిపారు. టీడీపీ నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రాంబాబును అభినందిస్తున్న బేబీనాయన

గోప్యంగా ఎల్లారమ్మ ఉత్సవ కమిటీ ప్రమాణం



రెండురోజుల క్రితం ప్రమాణస్వీకారం చేసిన కమిటీ

జామి: జామి ఎల్లారమ్మ జాతర ఏటా మూడులక్షలమంది భక్తుల రాకతో అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఇంత ప్రముఖ జాతరను పేరుకే దేవదాయశాఖ అని చెప్పుకోవడం తప్ప అంతా స్థానిక అధికారపార్టీ కనుసన్నల్లో జరుగుతుందనేది మండల వాసులకు తెలిసిన సత్యం. ఈ జాతర జరిగే ప్రతి ఏడాది భక్తులకు అవస్థలు తప్పవు. అయితే అప్పటికప్పుడు సరిదిద్దుతామని చెప్పే అధికారులు తరువాత దీని విషయం మరిచిపోవడం పరిపాటైంది. జాతర పేరుతో కొంతమంది నాయకులు లక్షలు వసూలు చేసి తమ జేబులో వేసుకుంటారనే ప్రధానమైన ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈఏడాది ఈ జాతర ఈనెల 16నుంచి 18వరకు జరగనుంది. ఇంత పెద్ద జాతరకు ఇప్పటివరకు ఇంకా దేవదాయశాఖ ఏర్పాట్లు ప్రారంభించకపోవడం విశేషం. అంతేకాకుండా ఈ జాతరకు సంబంధించిన కీలకమైన ఘట్టం చాలా గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించడం, ఈజాతరకు సంబంధించి రెండేళ్లకు ఒక ఉత్సవ కమిటీను ఏర్పాటుచేస్తారు. అయితే ఈ ఏడాదితో దీని పదవీ కాలం ముగియడంతో ఈ సారి ఎమ్మెల్యే సిఫార్సుతో ఉత్సవ కమిటీ ఏర్పాటుచేశారు. అయితే సదరు ఉత్సవ కమిటీతో ఎవరికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గుట్టుచప్పుడు కాకుండా ప్రమాణాస్వీకారం చేయించడం చర్చంశనీయంగా మారింది. ఈ ప్రమాణ స్వీకారానికి సంబంధించి కనీసం మీడియాకు కూడా దేవదాయశాఖ చెప్పకపోవడం ఆశ్చర్యం కల్గిస్తుంది. ఇంత పెద్ద జాతర దేవాదాయశాఖ కాకుండా స్థానిక అధికారపార్టీ కనుసన్నల్లో జరుగుతుందనేది ఇక్కడ బహిరంగ రహస్యం. సంబంధిత శాఖలు కుడా వారి మాట కాదనకుండా చేస్తారనే పేరు ఉంది. ఈ ప్రమాణస్వీకారం విషయంపై ఈవో ప్రసాద్ వివరణ కోరగా స్థానిక నాయకులు చెబుతారనుకున్నామని ఒకసారి, తమ గుమస్తా చెబుతారని అనుకున్నామని మరోసారి.. ఇలా పొంతన లేని సమాధానం చెప్పారు. అదే విధంగా జాతర నిర్వహణకు నిధులు విషయం అడుగ్గా నిధులు ఏమి రావని నిర్వహణ ఖర్చులు బిల్లులు పెట్టుకుంటే తమ శాఖ నిధులు మంజూరు చేస్తుందని వాటిని అందరికీ చెల్లిస్తామని తెలియజేశారు.

స్వామినాథన్ ఆశయాలను ఆచరణలో పెట్టాలి

బొబ్బిలి, మార్చి 9: అంతర్జాతీయ స్థాయిలో వ్యవసాయశాస్త్రవేత్తగా ప్రఖ్యాతి గాంచిన భారతరత్న ఎంఎస్ స్వామినాథన్ ఆశయాలను కేంద్రప్రభుత్వం ఆచరణలో పెట్టాలని రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షుడు గోపాలం అధ్యక్షతన ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వ్యవసాయ రంగం చాలా సంక్లిష్టంగా మారడంతో రైతాంగం ఆ వృత్తి నుంచి పక్కకు తప్పుకుంటోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా సంస్థలు, పెట్టుబడిదారీ వ్యవస్థలకు అప్పనంగా కోట్లాది రూపాయలను ధారపోస్తున్నారే తప్ప ఆరుగాలం కష్టపడే రైతులను ఆదుకునేందుకు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చట్టబద్ధత అవసమరని స్వామినాథన్ ఏనాడో చెప్పారన్నారు. వ్యవసాయం బతకడానికి రైతులు సమున్నత స్థానంలో ఉండడానికి ఆయన చేసిన సిఫారసులు అమూల్యమని, ఆ మహనీయునికి భారతరత్న ఇచ్చి గౌరవించినట్లే ఆయన ఆశయాలకు కూడా అంతే గుర్తింపు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

● ఈనెల 14 న ఢిల్లీలో రైతు సంఘాలు నిర్వహించే మహాపడావో కార్యక్రమానికి అందరూ తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. దీనికోసం గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంక్షేమసంఘం, ఏఐటీయూసీ, సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, మునకాల శ్రీనివాస్, పి.శంకరరావు, శేషగిరి, కృష్ణ, భూషణ్, సాంబయ్య, మణికమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

ఆలయాన్ని స్వాధీనం చేసుకోవడం తగదు

కొత్తవలస, మార్చి 9: సెంటుభూమి లేదు, పైసా ఆదాయం లేని అప్పన్నదొరపాలెం దారపైడితల్లెమ్మ ఆలయాన్ని దేవదాయశాఖ ఎలా స్వాధీనం చేసుకుందని గ్రామానికి చెందిన దారపైడితల్లెమ్మ గిరిజన యువజన సేవా సంఘం సభ్యులు ప్రశ్నించారు. శనివారం గ్రామంలో సర్పంచ్ ఉగ్గిన రాములమ్మకు, స్థానిక శాసన సభ్యుడు కడుబండి శ్రీనివాసరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే కడుబండి ఆదేశాల మేరకే ఎటువంటి ఆదాయం లేని ఈ దేవాలయాన్ని దేవదాయశాఖ స్వాధీనం చేసుకుందన్నారు. ఇందుకు గ్రామ సర్పంచ్ జోడు రాములమ్మ వత్తాసు పలికారన్నారు. ఈ ఆలయం చుట్టూ ఉన్న 120 ఎకరాల భూమిని ముత్తాతల నుంచి తాము సాగుచేసుకుంటూ అనుభవిస్తున్నామన్నారు. ఈ భూములలో 10 ఎకరాల 80 సెంట్లు భూమిని ఎమ్మెల్యే బినామీలతో కొనిపించారని, అందుకే ఆలయాన్ని ప్రభుత్వ పరం చేయడానికి దేవదాయ శాఖకు అప్పగిస్తున్నారన్నారు. దారపైడితల్లెమ్మ ఆలయాన్ని తమ గిరిజనులకే తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

వైసీపీ నుంచి జనసేనలోకి..

తెర్లాం, మార్చి 9: మండలంలోని చుక్కవలస గ్రామానికి చెందిన 20 కుటుంబాలు జనసేన తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, జనసేన ఇన్‌చార్జ్ గిరడ అప్పలస్వామి, జనసేన కార్యనిర్వాహక కార్యదర్శి బాబు పాలూరుల సమక్షంలో వైసీపీని వీడి ఆబోతుల మాధవనాయుడు, ఆబోతుల సాంబమూర్తి, ఆబోతుల ఆదినారాయణ, ఆబోతుల శంకరరావు, ఆబోతుల బంగారినాయుడు, వావిలాపల్లి అప్పారావు, రాగాల స్వామినాయుడు, ఆబోతుల సత్యారావు, ఆబోతుల సింహాచలం, ఆబోతుల శంకర్, ఆబోతుల నరసింహులు, ఆబోతుల రాము, బోడసింగి శంకర్ తదితర 20 కుటుంబాలు పార్టీ కండువాలు వేసుకొని చేరారు.



పార్టీ కండువాలతో జనసేనలో చేరినవారు

ఊరటనిచ్చిన వర్షం

శృంగవరపుకోట రూరల్: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షం ప్రజలకు ఊరటనిచ్చింది. గడిచిన కొద్దిరోజులుగా ఎండ, ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ సమయంలో ఒక అరగంట పాటు వర్షం కురవడంతో చల్లదనం చోటుచేసుకుంది. శివరాత్రి రెండురోజుల్లో ఒక రోజు వర్షం కురవడం ఆనవాయితీ అని, ఆ ఆనవాయితీ కొనసాగిందని కొందరు పెద్దలు పేర్కొన్నారు.



విజయనగరం-ధర్మవరం రోడ్డులో వర్షం

'మహిళలను గౌరవించడం మన కర్తవ్యం'



వీరమహిళలను సత్కరిస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ

బొబ్బిలి, మార్చి 9: మహిళామణులందరినీ గౌరవించుకోవడం మన కర్తవ్యమని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు వీరమహిళలను ఆయన సత్కరించి బహుమతులు అందజేశారు. వీరమహిళ బంటుపల్లి దివ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అప్పలస్వామి మాట్లాడుతూ రానున్న టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వ హయాంలో మహిళా లోకానికి చేదోడువాదోడుగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తారన్నారు. బంటుపల్లి దివ్య మాట్లాడుతూ తల్లిగా, చెల్లిగా, అక్కగా, ఇల్లాలిగా, ఉద్యోగిగా, అధికారిగా, నాయకురాలిగా మహిళలు అందజేస్తున్న సేవలు అనితరసాధ్యమైనవని అన్నారు. జనసేన సీనియర్ నాయకులు లంక రమేష్, అడబాల నాగు, మాజీ ఎంపీటీసీ గిరడ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాలు

బొబ్బిలి: మండలంలోని జంట పంచాయతీలైన నారాయణప్పవలస, కాశిందొరవలస గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం శనివారం ప్రారంభమైంది. ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాలకు చెందిన రెండు యూనిట్ల ఎన్ఎస్ఎస్ అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బలగ అప్పలనాయుడు మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకు నేందుకు, సేవాతత్పరత అలవరుచుకోవడానికి ఎన్ఎస్ఎస్ బాగా దోహదపడు తుందన్నారు. తొలిరోజు ఆయా గ్రామాల్లో సీజనల్ వ్యాధులకు సంబంధించి ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్స్ పి.రామకృష్ణ, వై.సత్యనారాయణ, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

రేగిడి: మండలం బాలకాయవలసలో జీసీఎస్ఆర్ కళాశాల జాతీయ సేవా పథకం-1 పీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పురుషోత్తమరావు, రవీంద్ర, గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జాతీయ సేవా పథకంలో స్వచ్ఛంద సేవ కార్యకర్త, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీటీసీ హరనాథ్ మాట్లాడుతూ గ్రామంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ రవీంద్ర మాట్లాడుతూ గ్రామంలో వైద్యం, విద్య, పచ్చదనం, పారిశుధ్యం కార్యక్రమాలు చేపట్టడంతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం విశేషమన్నారు. రాంబాబు, కె.శ్రీనివాసరావు, తరంగి విశ్వనాథం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యారాడ తీరంలో బాలుడిని కాపాడిన లైఫ్ గార్డులు

మల్కాపురం (విశాఖపట్నం), మార్చి 9: మహా శివరాత్రి సందర్భంగా జాగరణ చేసిన ఓ బాలుడు బంధువులతో కలిసి యారాడ సముద్రంలో శనివారం స్నానమాచరిస్తుండగా కెరటాల తాకిడికి కొట్టుకుపోతుండగా జీవీఎంసీ లైఫ్ గార్డులు కాపాడారు. విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన కుమార్ (12) తమ బంధువులతో కలిసి యారాడ బీచ్‌కు వచ్చాడు. ఇక్కడ సముద్ర స్నానం చేస్తుండగా కెరటాల ఉధృతికి లోపలకు కొట్టుకుపోతుండడాన్ని గమనించిన లైఫ్ గార్డులు లోవరాజు, సీహెచ్ శ్రీనివాసరావు, కె.వెంకటేశ్ ఆ బాలుడిని కాపాడి ఒడ్డుకు తేవడంతో ప్రాణాపాయం తప్పింది.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

బొబ్బిలి, మార్చి 9: స్థానిక మున్సిపల్ పార్కు ముందు విద్యుత్ స్తంభాల దగ్గర విద్యుదాఘాతానికి గురై ఓ ఆవు శనివారం మృతి చెందింది. నిత్యం జన సంచారం ఉన్న కూడలి, ఇక్కడ బస్సు షెల్టర్ కూడా ఉంది. అటు పార్కుకు వచ్చే సందర్శకులు, ఇటు కళాభారతి ఆడిటోరియానికి వచ్చే వారితో సందడిగా ఉంటుంది. అలాంటి ప్రాంతంలో విద్యుదాఘాతంతో ఓ మూగజీవి బలైపోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కూడలిలో విచ్చలవిడిగా ఫ్లెక్సీలు కడుతున్నారని, ఇందుకోసం తీగలు వాడుతుంటారని, ఆ కారణంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఉంటుందని విద్యుత్ సిబ్బంది తెలుపుతున్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు అభినందనీయం

● మాజీ ఎమ్మెల్సీ జగదీష్



విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జగదీష్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల పొత్తు ఎంతో అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. శనివారం ఆయన పార్వతీపురంలోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేంద్రంతో చాలా విషయాలు పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. రైల్వేజోన్, అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా చూడడం తదితర విషయాలు కేంద్రంతో పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని, వీటితో రాష్ట్ర భవిష్యత్తు ఎంతో ముడిపడి ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్వతీపురం నియోజకవర్గం నుంచి టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోలా వెంకటరావు, జి.రవికుమార్, చుక్క జయప్రకాష్, డి.మోహన్, రాజశేఖర్, కె.ప్రదీప్, కౌన్సిలర్ వెంకటరమణ పాల్గొన్నారు.

విజయానికి కృషి చేయాలి

పార్వతీపురం రూరల్: టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్రను ఆయన చిన్ననాటి స్నేహితులు శనివారం వెంకమ్మపేట పంచాయతీ పరిధిలోని తన ఇంటి వద్ద కలిశారు. ఈసందర్భంగా ఆయనను అభినందించి, వచ్చే ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం కష్టపడతామన్నారు. టీడీపీ, జనసేన పార్టీ విజయం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు.

వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

గరుగుబిల్లి: వెనుకబడిన వర్గాలను వంచించిన వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి డి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం చిలకాం గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కురుపాం నియోజకవర్గంలో వర్గ విభేదాలకు తావులేకుండా అభ్యర్థి గెలుపే ప్రధానంగా దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ డి.గౌరమ్మ, పార్టీ ప్రతినిధులు బొంగు నారాయణ స్వామి, అరకు రైతు విభాగం కార్యదర్శి కండేన బలరాంనాయుడు, యువత ప్రతినిధి అక్కేన నారాయణరావు ఉన్నారు.

గుంపలో టీడీపీ ప్రచారం

కొమరాడ: కురుపాం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి గెలుపునకు కృషి చేయాలని అరకు పార్లమెంటు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దేవకోటి వెంకటనాయుడు కోరారు. శనివారం గుంప జాతరకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఆయన మజ్జిగ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన కురుపాం నియోజకవర్గంలో జగదీశ్వరిని గెలిపించి అసెంబ్లీకి పంపించాలంటూ పలువురిని కోరారు. మండల తెలుగు రైతు అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ కార్యదర్శి నూకరాజు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జనసేన-టీడీపీ దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు

భోగాపురం: ఉపాధ్యాయుల సమస్యలను జనసేన-టీడీపీ అధినేతల దృష్టికి తీసుకు వెళ్తానని ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి తెలిపారు. శనివారం పలువురు ఉపాధ్యాయులు ముంజేరు గ్రామంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆమెను కలిశారు. వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులను ఆమెకు వివరించారు. ఆ సమస్యలను చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్తానని ఆమె ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు డి.రాము, జిల్లా నాయకులు జేవీఆర్కే ఈశ్వరరావు, కె.ప్రసాదురావు, రమేష్ పట్నాయక్, మండల నాయకులు వైకుంటరావు, కోట శ్రీనివాసరావు, బెహరా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జన సైనికుల రక్తదానం



రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న అరుణ

దత్తిరాజేరు: మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో దత్తిరాజేరు మండలంలో స్వచ్ఛందంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. న్యూలైఫ్ బ్లడ్ సెంటర్ సహకారంతో జనసైనికుడు మిత్తిరెడ్డి తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా జనసేన రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యురాలు పడాల అరుణ విచ్చేశారు. రక్తదానం చేసిన 30మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు పడాల శరత్, చప్పా అప్పారావు, మునకాల జగన్, మామిడి దుర్గాప్రసాద్, ఆగూరు వినోద్‌కుమార్, సింహాద్రి ప్రవీణ్, సింగారపు రామకృష్ణ, సారిక మురళి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ సంబరాల్లో కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

దత్తిరాజేరు: ఇంగిలాపల్లి గ్రామంలో గాడివారి కుటుంబం నిర్వ హించిన శ్రీకృష్ణ సంబరాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ శనివారం పాల్గొన్నా రు. టీడీపీ-జనసేన విజయానికి కృషి చేయాలని గ్రామస్థులను కోరారు. ఈ కార్య క్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, బెజవాడ బంగారునా యుడు, కొండపల్లి సంతోష్, మాజీ సర్పంచ్ గాడి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'బీసీ డిక్లరేషన్‌ను స్వాగతిస్తున్నాం'

గుర్ల: చంద్రబాబు ఇటీవల ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను స్వాగతిస్తున్నామని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, గుర్ల మండలానికి చెందిన గండ్రేటి సింహాచలం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు అండగా ఉన్న పార్టీ ఒక్క టీడీపీయేనని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రజకులంతా కలిసి టీడీపీకి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం

గుర్ల: వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ బీసీ చీపురుపల్లి కార్యదర్శి మండల అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీసీలకు గౌరవం అందించే ఏకైక ప్రభుత్వం టీడీపీయేనని అన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేసే వరకు బీసీలు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పుట్టగొడుగుల పెంపకంతో యువతకు ఉపాధి

రేగిడి: పుట్టగొడుగుల పెంపకంతో యువతకు స్వయం ఉపాధి లభిస్తుందని, అందుకే ఈ యునిట్లను గ్రామీణ ప్రాంతాల్లో ప్రోత్సహిస్తున్నామని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి గోవిందరావు, విశాఖపట్నం అనూష ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ కె.రవికిరణ్ తెలిపారు. పుట్టగొడుగుల యూనిట్లు మంజూరైన 35 మంది నిరుద్యోగ యువతి, యువకులకు (18 నుంచి 35 ఏళ్ల లోపువారికి) ఉప్పరనాయుడువలసలో పది రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభమైంది. ఈసందర్భంగా వారు శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ గ్రామంలో పుట్టగొడుగుల సాగు యూనిట్ ఉండటంతో క్షేత్ర స్థాయిలో ఔత్సాహికులు పరిశీలించే విధంగా ఈ గ్రామంలో శిక్షణ ఏర్పాటు చేశామని రిసోర్స్ పర్సన్ సంతోష్ పట్నాయక్ తెలిపారు. ఈ శిక్షణలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గోవిందరావు మాట్లాడుతూ నీతిఆయోగ్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా రాయితీపై రుణ సౌకర్యం కల్పించి యువతకు బంగారు భవిష్యత్‌కు బాటలు వేయనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో స్కిల్‌డవలప్‌మెంట్ మండల కోఆర్డినేటర్ గణపతి, శిక్షకులు సంతోష్ పట్నాయక్ పాల్గొన్నారు.

సాగునీరు సందేహమే?

● మినీ వంతెన నిర్మాణంతో పెరిగిన బొండపల్లి-వెంకటాపురం కాలువ ఎత్తు
● చంపావతి నీరు వచ్చే అవకాశం తక్కువంటూ రైతుల ఆందోళన



పట్రువాడ గ్రామం వద్ద బీవీ కాలువ

గజపతినగరం: ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు సాగునీటికి వ్యయ ప్రయాసలు పడుతున్నారు. పాలకులు, అధికారులు మారతున్నా రైతులకు అవసరమైన సాగునీటి కాలువలు మాత్రం నిరుపయోగంగా ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని బీవీ (బొండపల్లి - వెంకటాపురం) కాలువ కింద గజపతినగరం, బొండపల్లి మండలాలకు చెందిన 8 గ్రామాల రైతులు సుమారు 3 వేల హెక్టార్లకు పైగా పంటల సాగు చేస్తున్నారు. అయితే ప్రతిఏటా వీరు సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల పట్రువాడ గ్రామం వద్ద మినీ వంతెన ఏర్పాటు చేయడంతో బీవీ కాలువ ఎత్తు పెరిగిందని, దీంతో రానున్న ఖరీఫ్‌కు చంపావతి నీరు బీవీ కాలువకు మళ్లించడం కష్ట తరమన్నారు. ఎత్తు తగ్గితేగానీ కాలువ ద్వారా నీరు వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. చంపావతి నదిలో బీవీ కాలువకు నీరు మళ్లించే విధంగా గోడ నిర్మాణం జరిగితే మేలు జరుగుతుందని, లేనిఎడల ఇబ్బందులు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంపావతిలో అక్రమంగా ఇసుక తరలించుకుపోవడం వల్ల బీవీ కాలువకు నీరు వచ్చే అవకాశాలు తగ్గుతున్నాయని, దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోతే రానున్న ఖరీఫ్‌కు సాగునీరు కష్ట తరమేనని రైతులు అంటున్నారు. గత ఏడాది వరకు పట్రువాడ గ్రామం వద్ద చంపావతి నదిలో ఇసుక బస్తాలు వేసి నీరు పంట పొలాలకు మళ్లించుకునేవారమ ని, ప్రస్తుతం మినీ వంతెన కారణంగా కాలువ ఎత్తు పెరగడం వల్ల ఇబ్బందులు తప్పవంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోడ నిర్మాణం చేపట్టి కాలువకు నీరు మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని రెండు మండలాల రైతులు కోరుతున్నారు. ఇటీవల మంత్రి బొత్స సత్యనారాయణ మినీ వంతెన ప్రారంభానికి వచ్చినప్పుడు రెండు మండలాల రైతులు వినతిపత్రం అందజేశారు.



బొండపల్లి: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



చీపురుపల్లిలో..



గుర్ల: మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ఆరుద్ర

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

బొండపల్లి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ జేడీ మనోరంజని సూచించారు. శనివారం గొట్లాం గ్రామంలో జాతీయ పౌష్టికాహార పక్షోత్సావాల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి, సూపర్‌వైజర్ టి.జానకి, సర్పంచ్ ఆదిలక్ష్మి, వైసీపీ సీనియర్ నాయకులు మీసాల తులసిరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ● **చీపురుపల్లి:** పోషణ పక్వాడపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీడీపీవో ఎస్.రాజరాజేశ్వరి కోరారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ చేశారు. పూర్వ ప్రాథమిక విద్యపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జి.పైడిమంగమ్మ, జె.లక్ష్మి, టి.శ్రీదేవి, ఎం.నాగమణి, చీపురుపల్లి, మెరకముడిదాం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ● **గుర్ల:** గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించే బాధ్యత ప్రతిఒక్కరూ తీసుకో వాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆరుద్ర అన్నారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కా ర్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్ శకుంతల రాధిక పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల కోసం..

● గ్రామాల్లో పోలీసుల కవాతు



చీపురుపల్లి: కవాతు చేస్తున్న పోలీసులు

పాలకొండ: పట్టణంలో డీఎస్పీ జీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్‌కే రాజపురం జంక్షన్ నుంచి వీరఘట్టం జంక్షన్ వద్ద ఉన్న అగ్నిమాపక కేంద్రం వరకు కవాతు నిర్వహించారు. సీఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రశాంత్ కుమార్, కేంద్ర బలగాలు ఈ కవాతులో పాల్గొన్నాయి. డీఎస్పీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా ప్రజలతో మమేకం అయ్యేందుకు ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో ఉన్న అన్ని మండలాల్లో కవాతు చేపట్టామన్నారు. ● **చీపురుపల్లి:** ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా పోలీసులు పట్టణంలో శనివారం కవాతు నిర్వహించారు. సీఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ నుంచి గాంధీ బొమ్మ, మెయిన్ రోడ్డు, లావేరు రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో ఈ కవాతు సాగింది. ఈ కార్యక్రమంలో వందమందికి పైగా కేంద్ర బలగాల సిబ్బంది, చీపురుపల్లి ఎస్ఐలు కె.కిరణ్‌కుమార్‌నాయుడు, లోకేష్ పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** పట్టణంలోని వీధుల్లో సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్ఐ గోవిందరావు ఆధ్వర్యంలో శనివారం పోలీసులు కవాతు నిర్వ హించారు. ఈసందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు, తగాదాలు, ఘర్షణలు పడకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ● **జియ్యమ్మవలస:** కురుపాం నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు కోరారు. శనివారం చినమేరంగి గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. చినమేరంగి సీఐ మంగరాజు, చినమేరంగి, జియ్యమ్మవలస, గరుగు బిల్లి పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు ఇ.చిన్నంనాయుడు, పి.అనీష్, వై.అమ్మన్నరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పాలకొండ: కవాతులో పాల్గొన్న డీఎస్పీ కృష్ణారావు



జియ్యమ్మవలస: చినమేరంగిలో..



వీరఘట్టంలో..

ఘనంగా శివరాత్రి ఉత్సవాలు



తప్పెటగుళ్లు ప్రదర్శిస్తున్న దృశ్యం

చీపురుపల్లి: మహా శివరాత్రి ఉత్సవాలు పట్టణంలోని గవిడి వీధిలో శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. స్థానికులు రాములవారి కోల ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రంతా జాగరణ చేసి, తెల్లవారు జామున కోలను గంగలో నిమజ్జనం చేశారు. తప్పెటగుళ్ళు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెల్లాన శ్రీదేవి, మీసాల వరహాలనాయుడు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతారామునిపేటలో రుద్రాభిషేకం



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న నాగమాధవి దంపతులు

నెల్లిమర్ల: రామతీర్థంలో శుక్రవారం శివరాత్రి జాతర సందర్భంగా టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగ మాధవి ఆధ్వర్యంలో సీతారామునిపేట జంక్షన్‌లో మహా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాధవి, ప్రసాద్ దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాములోరి సేవలో..



భజనలు చేస్తున్న డెంకాడవాసులు

డెంకాడ: దశాబ్దాల కాలం నుంచి మండల కేంద్రంలోని పైడియ్య, నాయుడు కుటుంబాలు మహాశివరాత్రి నాడు రామతీర్థంలో కోలతో భజనలు చేస్తూ రాములోరి సేవ చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం రామతీర్థంలో రాత్రంతా జాగరం చేసి, శనివారం కోలతో భజనలు చేశారు. గ్రామ పెద్ద రొంగలి గోపాలకృష్ణతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించండి

● డీఎంవో జగన్మోహనరావు

సీతానగరం: గర్భిణుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించా లని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. సీతానగరం పీహెచ్‌సీలో నిర్వహించిన పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. గర్భిణులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు, వాటి నివేదికలను మాతాశిశు సంరక్షణ కార్డులో పరిశీలించారు. కొత్తగా ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే హైరిస్క్‌గా పరిగణించి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణుల ఆరోగ్య సమస్యలను క్షేత్ర స్థాయి సిబ్బంది సలుభంగా గుర్తించే పద్ధతులను ఆయన వివరించారు. గర్భిణులతో మాట్లాడి పలు ఆరోగ్య సలహాలను సూచించారు. ప్రిజం10 ఉద్దేశాన్ని వారికి వివరిస్తూ ప్రస్తుత కార్యాచరణపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పావని, సూపర్‌వైజర్లు సత్యవతి, శర్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత వస్తువులకు దూరంగా ఉండాలి

గరుగుబిల్లి: గ్రామాల్లో నిషేధిత వస్తువులకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఉల్లిభద్రలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల అసోషియేట్ డీన్ డా.బి.ప్రసన్నకుమార్ అన్నారు. మన గ్రామం - మన విశ్వ విద్యాలయం కార్యక్రమంలో భాగంగా శనివారం సంతోషపురంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను ప్రారంభించారు. కళాశాల పరిధిలో సంతోషపురాన్ని దత్తత గా తీసుకున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ అధికారులు బి.హరిరామకుమార్, జి.న రసింహమూర్తి, సీహెచ్ కిరణ్‌కుమార్‌లతో పాటు సర్పంచ్ ఎ.తవిటినాయుడు, కార్యదర్శి రాజేష్ చరణ్, కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హిందీ పరీక్షలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కురుపాం: హైదరాబాద్ హిందీ ప్రచార సభ నిర్వహించే హిందీ పరీక్షలు కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలు కురుపాం హిందీ పరీక్ష కేంద్రం వ్యవస్థాపకుడు సంతోష్‌కుమార్ పండా ఆధ్వర్యంలో జరిగాయి. విశారద, భూషన్ పరీక్షకు 56 మందికిగాను 51 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా హెచ్ఎం టి.శంకరరావు, డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా ఎంఈవో ఎస్.సత్యనారాయణ వ్యవహరించారు.

లోక్ అదాలత్‌లో 1,709 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

ఒడిశా

రాయగడ: జిల్లా న్యాయసేవా విభాగం ఆధ్వర్యంలో రాయగడ జిల్లా సివిల్ కోర్టు ప్రాంగణంలో మొదటి రాష్ట్రీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. న్యాయసేవా విభాగం లోక్‌అదాలత్ న్యాయాధికారి సత్యనారాయణ షడంగి, జిల్లా న్యాయవిభాగం కార్యదర్శి నివేదిత పండా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న 1,709 కేసులను పరిష్కరించి రూ.కోటి 12లక్షల 10వేల 325 జరిమానా వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి అమృత్‌రంజన్ నంద్, పర్మినెంట్ లోక్‌అదాలత్ చైర్మన్ ఎస్.కె.జహీర్ అహ్మద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవిప్రసాద్ పట్నాయక్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నిలువ నీడ లేక..

● మక్కువ మండల కేంద్రంలో బస్సు షెల్టర్ లేని వైనం
● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



మెయిన్ రోడ్డు జంక్షన్‌లో నేలపై కూర్చుని బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

మక్కువ: మండల కేంద్రంలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. బస్సు కోసం రోడ్డు పక్కన, దుకాణ సముదాయాల ముందు ఎండలోనే వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం వందలాది మంది ప్రయాణికులు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు మండల కేంద్రానికి చేరుకుంటారు. నిల్చోవడానికి కనీసం ఖాళీ ప్రదేశం లేకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు దుకాణాల ముందు నిల్చొని ఉంటే వ్యాపారులతో చీత్కారాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. కొంతమంది ప్రయాణికులు నేలపై కూర్చొనే బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో బైరిసాగరం చెరువు సమీపంలో ఉన్న బస్‌షెల్టర్‌ను సక్రమంగా వినియోగించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారి శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికైనా రవాణా శాఖాధికారులు స్పందించి మండల కేంద్రం మక్కువలో బస్సు షెల్టర్ నిర్మాణం జరిపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా..

సీఎం సహాయ నిధి అందజేత

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని పెద్దకాపు వీధికి చెందిన పైల హర్షిత్‌కు రూ.2లక్షలు, కోమటిపేటకు చెందిన కోట్ని కల్పనకు రూ.4 లక్షలు సీఎం సహాయ నిధి మంజూరయ్యింది. ఈ చెక్కులను వైసీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం, శాసన మండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ చేతులమీదుగా శనివారం అందించారు. పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లిమర్ల: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనులు, లైన్ మార్గాల్లో చెట్ల తొలగింపు కారణంగా ఈనెల 10న ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నెల్లిమర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పిచ్చయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్లలోని పలు వీధుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

22 నుంచి సీతారామ ఆలయ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

గరుగుబిల్లి: రావుపల్లి గ్రామంలోని పెద్దవీధిలోగల శ్రీసీతారామ మందిరంలోని విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవాలను ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 22, 23 తేదీల్లో ప్రత్యేక పూజలు, 24న విగ్రహ ప్రతిష్ఠ, అన్నసమారాధన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు.

నూతన భవనాలు ప్రారంభం

వీరఘట్టం: చిదిమి, నడిమికెల్ల గ్రామాల్లో సచివాలయాలు, కంబర గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాలను శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ జంపు కన్నతల్లి, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కురుపాంలో బెంచీల ఏర్పాటు

కురుపాం: మండల కేంద్రంలోని పలు వీధుల్లో కురుపాం పంచాయతీ ఆధ్వర్యంలో ఆర్థిక సంఘం నిధులతో 40 బెంచీలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

పాలకొండ: మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నగర పంచాయతీకి సంబంధించి 1341, పాలకొండ మండలానికి సంబంధించి 541 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.